సాక్షి
ఒడిశా
గురువారం । 12 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,31,670లు, బంగారం 350 మిల్లీగ్రాములు, వెండి 32.9 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ఆయువు తీసిన క్షణికావేశం

- 8లో



చిత్రకొండలో విదేశీ పక్షుల లెక్కింపు

- 8లో

న్యూస్‌రీల్


కళ్లికోట్ యూనివర్సిటీలో ఉద్రిక్తత



యూనివర్సిటీ మెయిన్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బరంపురం: దక్షిణ ఒడిశాలో ప్రఖ్యాతి చెందిన కళ్లికోట్ విశ్వ విద్యాలయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్లస్3 ఆఖరి సెమిస్టర్ పరీక్షల్లో మార్కులు తక్కువ రావడంతో విద్యార్థులు మెయిన్ గేటు ముందు ఆందోళనకు దిగారు. దీంతో విశ్వ విద్యాలయ ప్రాంగణం ఒక్కసారిగా వేడెక్కింది. యూనివర్సిటీ పాలనా యంత్రాంగం తమ భవిష్యత్‌తో ఆడుకుంటున్నారని బాధిత విద్యార్థులు ఆరోపించారు. వివిధ విభాగాల్లో అధ్యాపకులు లేరని, లైబ్రరీలో అవసరమైన పుస్తకాలు సైతం అందుబాటులో లేవన్నారు. విశ్వ విద్యాలయంలో తరగతులు కూడా సరిగ్గా జరగడం లేదని, ఈ నేపథ్యంలో తామంత ఇంటి వద్ద నుంచే పరీక్షలకు సన్నద్ధమయ్యామని తెలిపారు. అయితే ఉద్దేశ పూర్వకంగానే మార్కులు తక్కువగా వేశారని, జవాబు పత్రాలను మరోసారి మూల్యాంకన చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై వైస్ చాన్సలర్ ప్రఫుల్లకుమార్ మహంతికి వినతిపత్రం అందించారు.

ఆకట్టుకున్న సైకత శిల్పం



సత్య మహరాణా రూపొందించిన వివేకానంద సైకతశిల్పం

బరంపురం: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం నేపథ్యంలో నగరంలోని భెజ్జిపూర్, నీలకంఠ నగర 3వ లైన్‌కు చెందని సైకతశిల్పి సత్యనారాయణ మహరాణా తన కళా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. తన కళా నైపుణ్యంతో స్వామి వివేకానంద సైకత శిల్పాన్ని ఆవిష్కరించి, ఆకట్టుకున్నారు. గురువారం ప్రపంచ వ్యాప్తంగా వివేకానంద జయంతి జరుపుకోనున్న తరుణంలో ఘనంగా నివాళులర్పించారు.

ఆరంభం.. అదుర్స్..



హాకీ ప్రపంచకప్-2023 ప్రారంభోత్సవం సందర్భంగా కటక్ బరాబటి స్టేడియంలో బాణసంచా వెలుగులు

- కటక్ బరాబటి స్టేడియంలో ప్రారంభమైన హాకీ ప్రపంచకప్ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం నవీన్ పట్నాయక్
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రోన్ షో
- అలరించిన దిశా పటానీ, బాలీవుడ్ తారలు

భువనేశ్వర్: హాకీ పురుషుల ప్రపంచకప్-2023 కటక్‌లోని చారిత్రాత్మక బరాబటి స్టేడియంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఎఫ్ఐహెచ్ ప్రపంచ కప్ పురస్కరించుకుని ఒడిశాకు విచ్చేసిన అంతర్జాతీయ హాకీ జట్లు, ప్రముఖులు, అతిథులను సీఎం సాదరంగా ఆహ్వానించారు. మిలీనియం సిటీ కటక్ బరాబటి స్టేడియంలో ప్రేక్షకులను ఉద్దేశించి తనదైన శైలిలో ప్రారంభోత్సవ ఉపన్యాసం చేశారు. 'ఆతిథ్యానికి ఒడిశా ప్రసిద్ధి చెందింది. సందర్శకులంతా ఒడిశాలో ఆత్మీయతలో కొంత భాగాన్ని తమతో పాటు ఇంటికి తీసుకు వెళ్తారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. 'అపాణొ మానే ఖుసీ తో, మూ భీ బొహుత్ ఖుసీ'(మీ అందరికీ సంతోషమే కదా.. నాకు కూడా చాలా సంతోషంగా ఉంది.) అని వ్యాఖ్యానించారు. వరుసగా రెండోసారి ఒడిశా వేదికగా జరుగుతున్న అంతర్జాతీయ మెగా ఈవెంట్‌ను నిర్వహించేందుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

డ్రోన్ షో ప్రత్యేకం..

అత్యాధునిక డ్రోన్ షో తొలిసారిగా ప్రదర్శించడం విశేషం. ఒకేసారి 500 డ్రోన్‌లు నింగికెగసి, పలు విన్యాసాలు ప్రదర్శించాయి. ముందుగా అరుణా మహంతి, నమితా మెలేక ఆధ్వర్యంలో గిరిజన నృత్య ప్రదర్శనతో మనోరంజక కార్యక్రమాలు ఆరంభమయ్యాయి. అనంతరం బ్లాక్ స్వాన్ గ్రూప్ నృత్య ప్రదర్శన, వీనుల విందుగా గాయని సునీతి మిశ్రా గీతాలాపన ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమంలో దిశా పటానీ, బాలీవుడ్ తారలు సబ్యసాచి, అర్పిత, ఎలీనా సామంతరాయ్, అనన్య నంద్, లీసా మిశ్రా, మహరాజ్ మొహంతి, సునీతి మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాణసంచా మధ్య బరాబటి స్టేడియం ప్రాంగణానికి కొత్త వెలుగులతో మిరుమిట్లు గొలిపించింది.

రెండోసారి మహదావకాశం..


కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) అధ్యక్షుడు తయాబ్ ఇక్రమ్, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ, రాష్ట్ర క్రీడల మంత్రి తుషార్‌కాంతి బెహరా, 5టీ శాఖ సెక్రటరీ వీకే పాండ్యన్, రాష్ట్ర క్రీడా విభాగం కార్యదర్శి వినీల్‌కృష్ణ ప్రారంభోత్సవ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనురాగ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో నిర్వహించిన అన్ని ప్రపంచకప్ హాకీలలో, భారతదేశం, ఒడిశా అత్యంత ప్రసిద్ధి చెందాయన్నారు. హాకీ ప్రపంచ కప్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశం భారత్‌కు వరుసగా 2 సార్లు లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇది ఒడిశా ప్రభుత్వ కృషితోనే సాధ్యపడిందని అభినందించారు.

పటిష్ట బందోబస్తు..

హాకీ ప్రపంచకప్ ప్రారంభోత్సవం పురస్కరించుకుని బరాబటి స్టేడియానికి మూడంచెల భద్రత కల్పించారు. ఈ కార్యకలాపాల్లో 50 ప్లటూన్ల పోలీసు బలగాలు, 200 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. స్టేడియం లోపలిలోకి ఆహారం, తినుబండారాలు, పానీయాలు, నీటి సీసాలు అనుమతించ లేదు.

అడుగడుగునా ప్రత్యక్ష ప్రసారం..

హాకీ ప్రపంచకప్ ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సెలవు ప్రకటించారు. ప్రారంభోత్సవం వేడుకల ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించేందుకు పాఠశాలలకు ఒంటి పూట సెలవు ప్రకటించారు. కటక్ మెట్రోపాలిటన్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సెలవు ప్రకటించారు. స్థానిక రూపాలి స్క్వేర్, కళింగ స్టేడియం, ఎయిర్‌పోర్ట్ ప్రాంతాల్లో ఎల్ఈడీలను ఏర్పాటు చేశారు.



105 అడుగుల హాకీ స్టిక్..

భువనేశ్వర్: ప్రపంచం చూడని అతిపెద్ద హాకీ స్టిక్. కటక్ బల్లీ జాతర గ్రౌండ్ కటక్ ఇన్ కటక్ ప్రాంగణంలో సైకతశిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ దీనిని ఆవిష్కరించారు. 5000 హాకీ బంతులతో తయారు చేయగా, ఇందులో హాకీ స్టిక్, వరల్డ్‌కప్ ట్రోఫీ, హాకీబాల్, బిర్సాముండా స్టేడియాలను ప్రదర్శించారు. ఈ హాకీ స్టిక్ పొడవు 105 అడుగులు, ఎత్తు 22 అడుగులు. హాకీ ప్రపంచకప్-2023లో పాల్గొనే అన్ని దేశాల పతాకాలను ప్రదర్శించారు.



ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



ఉర్రూతలూగించిన బ్లాక్‌స్వాన్ బృందం నృత్యం



ఆకట్టుకున్న దిశా పటాని నృత్య ప్రదర్శన

స్టేడియం కిటకిట..



హాకీ ప్రపంచకప్ ప్రారంభోత్సవం రాష్ట్ర ప్రజలంతా తిలకించాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విన్నవించారు. రాష్ట్ర క్రీడాశాఖ ప్రత్యక్ష పర్యవేక్షణలో బరాబటి స్టేడియంలో ప్రారంభ వేడుకల కోసం అత్యాధునిక వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో దాదాపు 30వేల మంది ప్రేక్షకులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. టిక్కెట్లు, పాస్‌లు ఉన్న ప్రేక్షకులను మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతించారు. ప్రేక్షకులతో కటక్ బరాబటి స్టేడియం కిటకిటలాడింది. మరోవైపు ప్రపంచకప్-2023 మ్యాచ్‌లు ఈనెల 13 నుంచి నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రారంభ మ్యాచ్ రౌర్కెలా బిర్సా ముండా స్టేడియంలో, ఫైనల్ మ్యాచ్ జనవరి 29న స్థానిక కళింగ స్టేడియంలో జరగనుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్, నటి దిశాపటాని ప్రారంభ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ సంగీత దర్శకుడు ప్రీతమ్ సంగీతం ప్రేక్షకులతో కెవ్వు కేక అనిపించింది. బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమైన కార్యక్రమాలు రాత్రి 9 గంటల వరకు నిరవధికంగా కొనసాగాయి.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్



రుతురాజ్ మహంతి సినీ సంగీతాలాపన

ఉరిమే.. ఉత్సాహం



రేస్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న యువతులు



మినీ మారథాన్ రేసులో పాల్గొన్న ఔత్సాహికులు



పురుషుల విభాగంలో ప్రథమ బహుమతిని అందుకుంటున్న ఈశ్వర్

- రాయగడ మినీ మారథాన్‌కు అనూహ్య స్పందన
- పోటీలను ప్రారంభించిన మంత్రి జగన్నాథ సరక
- 8 కిలోమీటర్ల లక్ష్యాన్ని నిర్దేశించిన నిర్వహకులు
- ఉత్సాహంగా పాల్గొన్న యువతీ, యువకులు

రాయగడ: చొయితి క్రీడోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ మారథాన్ రేస్‌కు అనూహ్య స్పందన లభించింది. రాయగడ రిలయన్స్ మార్ట్ కూడలి నుంచి బుధవారం ఉదయం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలో యువతీ, యువకులు ఆసక్తిగా పాల్గొన్నారు. నిర్వాహకులు రిజిస్ట్రేషన్‌కు ఉదయం 5.30 గంటలకు ప్రారంభించగా, గంట ముందుగానే పోటీదారులు బారులుతీరడం కనిపించింది. రిలయన్స్ కూడలి నుంచి ప్రారంభమైన ఈ రేస్‌లో 8 కిలోమీటర్ల దూరంలోని హలువా తోట వద్ద గమ్యస్థానంగా నిర్వాహకులు నిర్దేశించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక జెండా ఊపి, పోటీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొయితి ఉత్సవాల్లో ఎంతో మంది ఆసక్తిగా పాల్గొనడం అభినందించాల్సిన విషయమన్నారు. ఐఖ్యతకు అద్దం పట్టే విధంగా నిర్వహించే మినీ మారథాన్‌కు యువతీ, యువకుల నుంచి ఇంతటి స్పందన రావడంపై ఆనందం వ్యక్తంచేశారు. ఇదే తరహా ఉత్సాహంతో ఈనెల 18 నుంచి స్థానిక గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న ముగింపు ఉత్సవాలను కూడా అంతా కలసికట్టుగా విజయవంతమయ్యేలా సహకరించాలని కోరారు. జిల్లా కలక్టర్ స్వాధాదేవ్ సింగ్ మాట్లాడుతూ ప్రజా హితానికి సంబంధించిన ఏ కార్యక్రమమైనా ప్రజల నుంచి మంచి స్పందన, సహకారాలు లభిస్తున్నాయని, వారి స్ఫూర్తితోనే ప్రతి కార్యక్రమం విజయవంతం అవుతోందని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయ మాఝి, బిజూ స్వాస్థ్య కమిటీ సలహాదారుడు సుధీర్‌దాస్, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కలెక్టర్..

మినీ మారథాన్ రేసులో జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ పాల్గొని, అందరినీ ఆశ్చర్య పరిచారు. 8 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఆమె పరుగు, నడకతో గమ్యస్థానానికి చేరుకున్నారు. మిగతా అధికారులంతా వాహనాలో ఆమెను అనుసరించడం గమనార్హం. రేసులో పాల్గొన్న వారిని ఉత్సాహ పరిచేందుకే పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు.

మార్వడీ యువమంచ్ ఉదారత

మినీ మారథాన్‌లో భాగంగా స్థానిక మార్వాడీ యువమంచ్ తన సహకారాన్ని అందించింది. ప్రతి కూడలిలో రేస్‌లో పాల్గొన్న వారికి వాటర్ బాటిళ్లు, ఎనర్జీ డ్రింక్‌లు, గ్లూకోజ్ అందించి, ఉత్సాహ పరిచారు. సంఘం అధ్యక్షుడు అజిత్ జైన్ నేతృత్వంలో రేసులో పాల్గొని, టాప్-10లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రేసులో పాల్గొన్న వారందరికీ రూ.500ల చొప్పున నగదు అందించనున్నట్లు జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ప్రకటించారు.

విజేతలు వీరే..

ఈ రేస్‌లో మొత్తం 650మంది యువతీ, యువకులు పాల్గొనగా.. మహిళల విభాగంలో విద్యుత్ ప్రభ తురుక్ ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. పింకి హిమిరిక ద్వితీయ బహుమతి, పంచాలి సునా తృతీయ బహుమతి సాధించారు. పురుషుల విభాగంలో ఈశ్వర్ హికక ప్రథమ స్థానాన్ని గెలుచుకోగా, బలభద్ర హికక, రాజాన ధోని తరువాతి రెండు స్థానాల్లో నిలిచారు. 2, 3 బహుమతులు గెలుచుకున్న వారికి రూ.3 వేల చొప్పున నగదు బహుమతిని అందించగా, ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.8 వేల చొప్పున బహుమతులు అందించారు. అదేవిధంగా టాప్-10లో నిలిచిన మిగతా వారికి రూ.వెయ్యి చొప్పున్న నగదు అందించి, ప్రోత్సహించారు.



మార్గం మధ్యలో వాటర్ బాటిళ్లు అందిస్తున్న మార్వాడీ యువమంచ్ సభ్యులు

సాగర తీరాన్ని పరిరక్షించుకోవాలి




తీరంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న కేంద్రమంత్రి, యువ మోర్చా నాయకులు

- కేంద్రమంత్రి దర్శన్ జర్దోష్

బరంపురం: గోపాల్‌పూర్ సాగర తీరంలో స్వచ్ఛ సాగర్ సురక్షా అభిజాన్‌లో యువత పాల్గొవాలని, తీర ప్రాంత పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగించాలని కేంద్ర రైల్వే, చేనేత శాఖ సహాయమంత్రి దర్శన్ జర్దోష్ పిలుపునిచ్చారు. గంజాం, గజపతి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో గత మూడు రోజులుగా పర్యటిస్తున్న ఆమె.. బుధవారం బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్ సురక్షా అభిజాన్‌లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకీ పర్యావరణం క్షీణిస్తోందని తెలిపారు. దీని కారణంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నట్లు ఆవేదన వ్యక్తంచేశారు. పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలంటే స్వచ్ఛసాగర్ ప్రతిఒక్కరూ కార్యక్రమంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. అనంతరం సముద్ర తీరంలో చెత్త, ప్లాస్టిక్ సంచులను ఏరివేసి, ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో బీజేపీ యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వారణాసి ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ చంద్రశేఖర సాహు, కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: కాశీనగర్ బ్లాక్ కార్యాలయం వద్ద వారణాసి ఉత్సవాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఈనెల గజపతి ఉత్సవాలు 18న పర్లాకిమిడిలో జరుగనున్న నేపథ్యంలో ప్రతి సమితి కేంద్రాల్లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీ చంద్రశేఖర సాహు, కలెక్టర్ లింగరాజ్ పండా, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, కాశీనగర్ ఎన్ఏసీ చైర్మన్ మేడిబోయిన సుధారాణి, జోన్-1 జెడ్పీటీసీ రొక్కం రాజ్యలక్ష్మీ, కాశీనగర్ బీడీఓ కపిలేశ్వర తండి, తహసీల్దార్ ఆశిష్‌కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు. బీడీఓ కపిలేశ్వర తండి మహోత్సవాలకు అధ్యక్షత వహించగా కవి ప్రశాంతమిశ్రా, సీడీపీఓ బి.కోమలిని, భవానీశంకర్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కాశీనగర్‌లో పలువురు కళాకారులు ఒడిస్సీ నృత్యాలు ప్రదర్శించగా, గాయనీ, గాయకులు తమదైన శైలిలో పాటలు పాడి అధికారులు, ప్రేక్షకులను మెప్పించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ వారణాసి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి.

క్లుప్తంగా

ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి చర్యలు

పార్వతీపురం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని వినియోగిస్తే ఈప్రాంతం అభివృద్ధి చెందేందుకు ఎంతో అవకాశం ఉంటుందని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధిపై ఆర్టీసీ ఎం.డి ద్వారకా తిరుమలరావును ఇటీవల తాను కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో షాపింగ్ మాల్ నిర్మాణంపై చర్చించినట్లు పేర్కొన్నారు. దీనిపై ఆర్టీసీ ఎం.డి సానుకూలంగా స్పందించి గడిచిన ఏడాది నవంబర్‌లో జరిగిన ఆయన పర్యటనలో పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్థలంలో అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారన్నారు.

సారా అమ్మకాలపై నిఘా



పట్టుబడిన సారాతో ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సిబ్బంది

పార్వతీపురం: సారా తయారీ, అమ్మకాలపై పోలీసులు నిఘా పెంచారు. పార్వతీపురం మున్సిపాల్టీ పరిధి పెదరెల్లి వీధిలో సారా అమ్మకాలు, నిల్వలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు జరిపారు. ఇంటింటా సోదాలు చేశారు. 240 లీటర్ల సారా, 200 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలపై ఆరా



ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఆంజనేయులు

కురుపాం: స్థానిక ప్రభుత్వాస్పత్రిని కురుపాం కోర్టు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఇ.ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మందుల నిల్వను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాముకాటు, కుక్కకాటు, ఇతర వ్యాధులకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అంబులెన్స్ సేవలపై సిబ్బందిని ప్రశ్నించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. అనంతరం స్థానిక స్టేట్‌బ్యాంకును సందర్శించి ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా మండల లీగల్ కమిటీకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నాడు-నేడు పనుల పరిశీలన

జియ్యమ్మవలస: జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ డీవీ రమణ మండలంలో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. బుద్దిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం వంటలను రుచిచూశారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులు వేగవంతంగా పూర్తిచేయాలని హెచ్ఎం, స్కూల్ కమిటీ సభ్యులకు సూచించారు. అంగన్‌వాడీ వర్కర్లు అందుబాటులేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చిత్రకొండ జలాశయంలో విహరిస్తున్న విదేశీ విహంగాలు



పక్షులను లెక్కిస్తున్న అధికారులు

చిత్రకొండలో విదేశీ పక్షుల లెక్కింపు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి జలాశయంలో విడిది చేస్తున్న విదేశీ పక్షుల లెక్కింపును అటవీశాఖ రేంజర్ బలరాం నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి లెక్కింపు ప్రారంభించారు. ముందుగా చిత్రకొండ ఫిల్‌బాయి నుంచి లాంచీలో బయలుదేరిన అధికారులు.. బోటులో ముందుగా అల్లంపాక చేరుకున్నారు. అక్కడి నుంచి జాన్‌బాయి ధ్యనగూడ పరిసరాల వరకు లెక్కింపు పూర్తి చేశారు. తొలిరోజు 4,021 పక్షులను గుర్తించామని వెల్లడించారు. ఇందులో కింగ్‌ఫిషర్, క్విన్‌బాగ్, వాటర్ డక్, జైషర్వీ గ్రెబ్, బ్లాక్‌హెరాన్ ఉన్నాయన్నారు. లెక్కింపులో చిత్రకొండ రేంజర్ నిరంజన్ శెఠి, ముత్యుంజయ్ సాహు పాల్గొన్నారు.

ఆయువు తీసిన క్షణికావేశం

- వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం
- మృతుల్లో ఇద్దరు యువకులు
- రోడ్డు ప్రమాదంలో మరొకరి మృతి

మనస్థాపం, క్షణికావేశం ముగ్గురి ప్రాణాలను బలిగొన్నాయి. వీరిలో ఇద్దరు 18 ఏళ్ల లోపు యువకులు కావడం గమనార్హం. దేశ భవిష్యత్‌గా నిలవాల్సిన యువకులే ఇలా అర్ధాంతరంగా ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలోని రాయగడ, మల్కన్‌గిరి, గంజాం జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనలు బాధిత కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చాయి. గజపతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి చెందగా, మరో మహిళ తీవ్ర గాయాలపాలైంది.

రాయగడ:



లక్ష్మణ కోలక మృతదేహం

జిల్లాలోని రామనగుడ పోలీస్ స్టేషన్ పరిధి చాకుండ, గొసాయిగులు ముండ అటవీ ప్రాంతంలో యువకుడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు గులుముండ గ్రామానికి చెందిన లక్ష్మణ కోలక(18)గా గుర్తించారు. ఐఐసీ సునీతా బెహరా తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మణ్ అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువతి ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురూ కలిసి వారం రోజుల క్రితం ఇంటి నుంచి పారిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా, ఆచూకీ లభించలేదు. అయితే మంగళవారం సాయంత్రం చాకుండ, గొసాయిగులుముండ అటవీ ప్రాంతంలో ఓ యువకుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తన వద్ద ఉన్న తువ్వాలితో యువకుడు చెట్టుకు ఉరి వేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే యువకుడి మృతదేహం మాత్రమే కనిపించడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది హత్యా? లేక ఆత్మహత్య అనే గందరగోళం నెలకొంది. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి తిట్టాడని యువకుడి ఆత్మహత్య



ఇంట్లో ప్రదీప్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి ఎంవీ-51 గ్రామంలో తండ్రి తిట్టడంతో మనస్థాపానికి గురైన యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని, బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుమారుడు ప్రదీప్ బిశ్వాస్(17) ఆకతాయిగా తిరుగుతున్నాడని తండ్రి గోపాల్ బిస్వాస్ మంగళవారం రాత్రి భోజనం చేస్తున్న సమయంలో అసహనం వ్యక్తం చేశారు. దీంతో మనస్థాపానికి గురైన ప్రదీప్.. అంతా నిద్రిస్తున్న సమయంలో తల్లి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొన్నాడు. బుధవారం ఉదయం కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లి కేకలు వేయడంతో భర్త వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. బలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బలిమెల ఐఐసీ జాన్ ఖుజుర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

బరంపురం: బరంపురం రైల్వేస్టేషన్ సమీపంలోని లంజిపల్లి రైల్వే క్రాసింగ్ జామి పడియా వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేమాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న బరంపురం జీఆర్‌పీ పోలీసు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం లంజిపల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే జీఆర్‌పీ సిబ్బందికి తెలియజేశారు. గుర్తు తెలియని రైలు బలంగా ఢీకొనడంతో ట్రాక్‌పై శరీర భాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. దీంతో మృతదేహాన్ని గుర్తు పట్టడం కష్టతరంగా ఉండటంతో ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి



మిహిర్‌లాల్ మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య (ఇన్‌సెట్లో) మిహిర్‌లాల్ మిశాల్(ఫైల్‌ఫొటో)

పర్లాకిమిడి: ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొన్న ఘటనలో వ్యాపారి మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు రాయఘడ క్రిస్టియన్ వీధికి చెందిన మిహిర్‌లాల్ మిశాల్(42)గా పోలీసులు గుర్తించారు. బుధవారం ఉదయం వ్యాపారం నిమిత్తం మిహిర్‌లాల్ ఆదివాసీ సవర గ్రామానికి ఆటోలో వెళ్తుండగా మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో వ్యాపారి అక్కడిక్కడే మృతిచెందగా, మరో మహిళ కాలు విరిగిపోయింది. దీంతో ఆమెను పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మిహిర్‌లాల్ మృతి వార్త తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని, బోరున విలపించారు. రాయఘడ బ్లాక్ పోలీసు ఐఐసీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఇదే ప్రదేశంలో వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయగడ క్రిస్టియన్ వీధికి చెందిన వ్యక్తి గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో పోలీసులు అతనిని భువనేశ్వర్ లోని ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

ప్రపంచకప్‌కు ప్రత్యేక రైళ్లు

భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ పురుషుల ప్రపంచకప్-2023 మ్యాచ్‌లు పురస్కరించుకుని రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. భువనేశ్వర్, రూర్కెలాలో జరగనున్న మ్యాచ్‌లు తిలకించేందుకు వచ్చిపోయే వారి సౌకర్యార్థం 2 ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే విభాగం వెల్లడించింది. భువనేశ్వర్-రూర్కెలా(02834) స్పెషల్ రైలు ఈనెల 14నుంచి 30వరకు ప్రతి సోమ, బుధ, గురు, శనివారాల్లో రాత్రి 8:25 గంటలకు భువనేశ్వర్ నుంచి రౌర్కెలాకు బయలు దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళ, గురు, శుక్ర, ఆదివారాల్లో ఈనెల 15 నుంచి 31 వరకు రాత్రి 11:25 గంటలకు రౌర్కెలా నుంచి 02833 నంబర్ రైలు భువనేశ్వర్‌కు పయనమౌతుంది.

ఎక్కడెక్కడ..

భువనేశ్వర్-రూర్కెలా మధ్య కటక్, ఢెంకనాల్, తాల్చేర్ రోడ్డు, అంగూల్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగుడ స్టేషన్లలో ఈ రైళ్లు ఆగుతాయి.

పూరీ నుంచి..

ఈనెల 14 నుంచి 31వరకు 02836/02835 రైలు ప్రతి రోజూ నడుస్తుంది. పూరీ రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 5:15 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 12:45 గంటలకు రౌర్కెలా చేరుతుంది. తిరుగు ప్రయాణంలో రౌర్కెలా నుంచి మధ్యాహ్నం 01:30 గంటలకు బయలుదేరి రాత్రి 10:30 గంటలకు పూరీ చేరుతుంది. పూరీ-రౌర్కెలా మధ్య ఖుర్దా రోడ్, భువనేశ్వర్, నరాజ్, మార్థాపూర్, ఢెంకనాల్, తాల్చేర్ రోడ్డు, అంగూల్, రెఢాఖోల్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ, రాజ్ గంగ్‌పూర్ స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఒక 2టైర్, 3టైర్ మూడు, 8 స్లీపర్‌క్లాస్, 4 సెకండ్‌క్లాస్ సీటింగ్, 2గార్డు, లగేజీ వ్యాగన్లు, జనరేటర్ కార్లు ఉంటాయి.

విద్యలో క్రీడలు భాగం కావాలి

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: చదువులో క్రీడలు భాగం కావాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సూచించారు. పట్టణంలోని స్వయంపాలిత విక్రమ్ దేవ్ కళాశాలలో నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీలు బుధవారం ముగిసాయి. ఇందులో బాహిణీపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ క్రీడల వల్ల విద్యార్థుల్లో మనోవికాశంతో పాటు శారీరక ధృఢత్వం చేకూరుతుందన్నారు. క్రీడారంగంలో ప్రతిభ కనబరిచేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రపంచంలో క్రీడా రంగానికి ఎంతో ఆదరణ ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా నిర్వహించిన పరుగు పోటీల్లో బాలుర సీనియర్ విభాగంలో సురేష్ గోండ్, బాలికలలో ముక్త గదబ చాంపియన్‌లుగా నిలిచారు. బాలుర జూనియర్ గ్రూపులో సుమన్ ముదులి, బాలికల విభాగంలో స్వప్న పామియ విజయం సాధించారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ గోపాల హల్దార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఇంజినీర్ భాస్కరచంద్ర సామంతరాయ్, కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ నళినీ మహంతి, సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబినాయక్ తదితరులు పాల్గొన్నారు. కళాశాల క్రీడా సంపద్ సలహాదారు ప్రశాంత కుమార్ పాత్రో,డాక్టర్ రత్నాకర పారిడ, బినోద్ సిక్క, సచిన్‌కుమార్ నాయక్, మానసరంజన్ నాయక్, సంతోషిణీ ముండా, క్రీడా శిక్షకులు భగవత్ ప్రసాద్‌సింగ్ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. క్రీడాకారులు కాంత చౌదురి, జి.కోటేశ్వరరావు, ఉపేంద్ర మహరాణ, రమేష్ నాయక్, బాబుల బిశ్వాల్, బాబు షాడంగి ఆటల పోటీలను నిర్వహించారు.

జానపదం ఝల్లుమన్నది

- ఉత్సాహంగా జానపద కళాజాత

పలాస: అదొక పచ్చని పల్లె.. జానపదులకు పుట్టినిల్లు. ఆ ప్రాంతంలో పల్లెపదం జానపదం పరవశించింది. మండలంలోని చిన్ననీలావతి గ్రామంలో సిక్కోలు జానపద కళాజాత ఉత్సాహంగా బుధవారం జరిగింది. కళాకారుల పాటలు ఆకట్టుకున్నాయి. ముందుగా గ్రామంలో గ్రామ దేవతకు చల్లదనం చేశారు. అనంతరం వేదిక వద్ద కళాజాత ప్రారంభమైంది. గ్రామ దేవత రాజమ్మ వేషం, బొడ్డపాడు సన్నాయి మేళం ఎంతగానో అలరించాయి. మాకన్నపల్లి మహిళా కోలాటం, బొడ్డపాడు, గురుదాసుపురం, నీలావతి జానపద గీతాలు, కొర్లాం సుదేష్ణ నమో నమో ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ నృత్యం, రేగులపాడు పీత గంగయ్య తప్పెట గుళ్లు, బాహడపల్లి అందాల కోటేశ్వరరావు ఎరుకుల పాట, విజయనగరం రేలా రేలా రమణ, జానకిరావు, కుత్తుం వినోద్, దాసరి తాతారావు నక్కవాసు, సాలిన అశోక్‌కుమార్, సంగారి రాము తదితరులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు, టీడీపీ నాయకురాలు గౌతు శిరీష, విశ్రాంత జీఎస్టీ అసిస్టెంట్ జుత్తు తాతారావు, నీలావతి సర్పంచి సాంత్ర తిరుపతిరావు, మాకన్నపల్లి సర్పంచి సైని దేశయ్య, సంస్థ గౌరవ అధ్యక్షుడు బొడ్డు గాంధీ, గేదెల తులసయ్య, మామిడి కృష్ణారావు, కుత్తుం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'వివరాలు పరిశీలించండి'

కోటబొమ్మాళి: మండలంలో 38 పంచాయతీల్లోని బీఎల్‌వోలు ఆయా పంచాయతీల ఓటరు లిస్టులను పరిశీలించాలని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన బీఎల్‌వోలతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతీ పంచాయతీలో చనిపోయినవారిని గుర్తించి ఓటరు లిస్టుల నుంచి పేర్లను తొలగించాలన్నారు. అలాగే ఒక మనిషికి రెండు ఓట్లు ఉంటే వాటిని గుర్తించి ఒక ఓటును మాత్రమే జాబితాలో ఉంచాలన్నారు.

లోక్‌అదాలత్‌లతో సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న రెండవ అదనపు జిల్లాజడ్జి దామోదరరావు

పార్వతీపురంటౌన్: జాతీయలోక్ అదాలత్‌లతో కక్షిదారులకు సత్వర న్యాయం లభిస్తుందని, ఫిబ్రవరి 11వ తేదీన జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం కోర్టు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు చాంబర్‌లో పోలీస్, ఇతరశాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించి పోలీస్‌స్టేషన్ వారీగా పెండింగ్ కేసు వివరాలపై సమీక్షించారు. వాటిలో సాధ్యమైనన్ని కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు సమాజ హితం కోసం పనిచేయాలని, న్యాయసేవా సంస్థ పది అంశాలకు సంబంధించి పనిచేస్తుందని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సేవలను, అమలు చేస్తున్నపథకాలను సామాన్యుడికి చేర్చాలని కోరారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమమైనదని పేర్కొన్నారు. బడిమానేసిన విద్యార్థులను గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలన్నారు. అవసరమైతే విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. విద్యుత్ ప్రమాద బాధితులకు బీమా వర్తింపు, మానసిక రోగులకు సేవలు, గిరిజనుల హక్కుల అమలయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బ్యాంకింగ్, ఎలక్ట్రికల్, ఎక్సైజ్, కుటుంబ సంబంధిత కేసులు లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించాలని సూచించారు. సీనియర్ సివిల్‌జడ్జి యజ్ఞ నారాయణ, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.సౌజన్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, డీఎస్పీలు సుభాష్, జీవీ కృష్ణారావు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కార్మిక శాఖాధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

ఇచ్ఛాపురం: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసునికి ప్రత్యేక పూజల్లో భాగంగా భక్తులు మహా నైవేద్యం నివేదించారు. బుధవారం కూడారై పర్వదినం సందర్భంగా 108 ఇత్తడి పాత్రలతో పాయసాన్ని నైవేద్యంగా పెట్టారు.

స్వామివారికి హారతి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉల్లాసపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజా కార్యక్రమంలో భాగంగా కూడారై హారతిని సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కవిటి: మండల కేంద్రంలోని పట్టాభి రామాలయంలో స్వామీ కందాల పద్మనాభ యోగానందం ఆధ్వర్యంలో తిరుప్పావై ప్రవచనాలు ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రగడపుట్టుగ, కె.కొత్తూరు, బెజ్జిపుట్టుగ, భైరిపురం తదితర గ్రామాల్లో కూడారై పాయసాన్ని గోదారంగనాథులకు నివేదించారు.

చురుగ్గా..మెరుగ్గా..!

- సాగుతున్న శంబర జాతర పనులు
- భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలకు కృషి
- గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం
- పూర్తయిన మక్కువ, శంబర, మామిడిపల్లి రహదారులు



చదురుగుడి వెనుక క్యూ ప్రదేశం వద్ద క్రషర్‌బుగ్గితో చదును చేస్తున్న దృశ్యం

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి జాతర పనులు జోరుగా జరుగుతున్నాయి. గత ఏడాది కంటే, ఈఏడాది జాతరకు వచ్చే భక్తులకు మౌలికసదుపాయలు మెరుగ్గా అందించేందుకు కృషి జరుగుతోంది. కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఆర్డీవో హేమలతల ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్ల పనులపై పార్వతీపురం, శంబర గ్రామాలలో రెండుసార్లు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి శంబర జాతర ఈఏడాది ఘనంగా జరిపించుకుందామని అధికారులను ఆదేశించడంతో గ్రామానికి చేరుకునే భక్తులకు అవసరమైన మౌలికసదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

చదును చేస్తున్న చదురుగుడి క్యూ ప్రదేశం

చదురుగుడి వెనుక క్యూలు ఉన్న ప్రదేశమంతా క్రషర్ బుగ్గితో, ఈవో వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో చదును చేయిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో లైటింగ్, కంట్రోల్‌రూమ్‌లనుంచి ఉన్నతాధికారులు జాతర సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు అందించేందుకు మైక్‌సెట్‌లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు.

గోముఖి బ్రిడ్జి రక్షణగోడకు రంగులు

శంబర పోలమాంబ అమ్మవారి ఆలయానికి సమీపంలో ఉన్న గోముఖి నది బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న రక్షణగోడలు రాత్రివేళల్లో భక్తులకు చక్కగా కనిపించేలా తెల్ల సున్నం వేయిస్తున్నారు. రక్షణగోడల వద్ద భక్తులకు ఎటువంటి ప్రమాదం సంభవించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

చక్కని రహదారి సదుపాయం

మండలకేంద్రం మక్కువ నుంచి, శంబర, సాలూరు మండలం మామిడిపల్లి గ్రామం వరకు రహదారులు మరమ్మతులు జారిన పడడంతో, పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులు దుమ్ము, ధూళితో అవస్థలు పడేవారు. ఈఏడాది మక్కువ నుంచి సాలూరు మండలం మామిడిపల్లి గ్రామం వరకు రహదారి నిర్మించడంతో భక్తులు వాహనాలపై సౌకర్యవంతంగా రాకపోకలు సాగించనున్నారు. అలాగే చదురుగుడి ఆలయం పక్కన ఉన్న నీలాటిరేవు గతంలో చాలా దిగువగా ఉండడంతో వాహనాల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. ఇటీవల దిగువ ఉన్న ప్రదేశంలో సీసీరోడ్డు నిర్మించి, ఎత్తు పెంచడంతో రాకపోకలు సాగించేందుకు ప్రస్తుతం సౌలభ్యంగా ఉంది. గ్రామంలోని అమ్మవారి ఆలయం ముందు వీధిలో పంచాయతీరాజ్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది. గ్రామంలోని అమ్మవారి యాత్రస్థలం నుంచి, సుమారు 40మీటర్ల మేరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. అందుకు అవసరమైన నిధులు రూ.23 లక్షలను రోడ్డు, భవనాల శాఖ మంజూరుచేసింది.



గోముఖి నది బ్రిడ్జి రక్షణగోడకు తెల్లసున్నం వేస్తున్న దృశ్యం



గ్రామంలో జరుగుతున్న సీసీరోడ్డు పనులు

పోలమాంబ ఘటాలకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఘటాల తిరువీధి ఉత్సవం బుధవారం సాయంత్రం ప్రారంభమైంది. ఉదయం చదురుగుడిలోని అమ్మవారి ఘటాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో అమ్మవారి ఘటాలు, పాలధార తిరువీధి ఉత్సవాన్ని ప్రారంభించారు. గ్రామంలోని అన్నివీధుల్లోనూ ఘటాలు తిప్పారు. అమ్మవారి ఘటాల్లో భక్తులు పండ్లు, బియ్యం వేసి మొక్కుబడులు చెల్లించారు. 14రోజుల పాటు అమ్మవారి ఘటాల తిరువీధి ఉత్సవం సాగనుంది. ఈ నెల 23న తొలేళ్ల ఉత్సవం, 24న సిరిమానోత్సవం, 25న అనుపోత్సవం నిర్వహిస్తారు.

క్లుప్తంగా

వ్యవసాయ యంత్రపరికరాల ధరపై సమావేశం



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి జిల్లా ధరల నిర్ణయిక కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జరిగింది. సమావేశంలో వివిధ పరికరాల ధరలపై అధీకృత డీలర్లు, తయారీదారులతో కమిటీ చైర్మన్, జేసీ మయూర్ అశోక్ చర్చించారు. ట్రాక్టర్‌తో కలిపి ఉపయోగించే 9 పళ్ల నాగలి సెట్, దమ్ము సెట్ హాఫ్ కేజ్ వీల్, హాఫ్ కేజ్ వీల్, చదును చేసే బ్లేడ్, గుంటక బ్లేడ్, రెండు పళ్ల నాగలి, పది పళ్ల దంతి తదితర పరికారాల ధరల నిర్ణయంపై వారితో చర్చించారు. వేర్వేరు కంపెనీల డీలర్లు, తయారీదారులు కోట్ చేసిన ధరలు ఖరారు చేయడానికి ప్రభుత్వానికి పంపిస్తామని డీలర్లకు జేసీ తెలిపారు. కంబైన్డ్ హార్వెస్టర్స్, టార్పాలిన్లు, స్ప్రేయర్లు, ట్రాక్టర్ల ధరలను ఇప్పటికే ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో నిర్ణయించిందని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఆగ్రోస్ డీఎం ప్రసాదరావు, డాట్ సైంటిస్ట్ తేజేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీ ప్రకాష్, ఇతర అధికారులు, 24 మంది డీలర్లు పాల్గొన్నారు.

బాక్సింగ్ లీగ్ పోటీలకు 12 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి శాప్ లీగ్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న శాప్ లీగ్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం పూర్తయ్యాయి. ఈ పోటీల్లో 12 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల ఇండోర్ బాక్సింగ్ హాల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు 30 మంది క్రీడాకారులు హాజరుకాగా..పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఎంపిక పోటీల్లో పి.దుర్గా ప్రసాద్, కె.తరుణ్, డి.దేవ స్వరూప్; పి.కౌశిక్, బి.హశ్వంత్, పి.ధన గణేష్, సీహెచ్ ధనుష్, బి.మహేష్, బి.జశ్వంత్, వి.జయరాం, వి.రఘు, ఎస్.దేవిక ఎంపికయ్యారు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన 11 మంది బాలురు, ఒక బాలిక త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి శాప్‌లీగ్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపిక పోటీలను జిల్లా బాక్సింగ్ కోచ్ బి.ఈశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

జిల్లాలో 26 కల్యాణ మస్తు దరఖాస్తులు

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి



కల్యాణమస్తు దరఖాస్తులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

రాజాం: వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకానికి జిల్లాలో 26 దరఖాస్తులు వచ్చాయని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణ పరిధిలోని ఆదర్శనగర్, మాదిగవీధి సచివాలయాల వద్ద దరఖాస్తు దారుల వివరాలు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పక్కాగా అర్హత ఉన్నవారందరికీ పార్టీలతో సంబంధంలేకుండా సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే వైఎస్ఆర్ కల్యాణమస్తు పథకం దరఖాస్తు దారుల వివరాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. జనవరి నెలాఖరులోగా దరఖాస్తుదారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందనుందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.1 లక్ష, ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి సంబంధించి కులాంతర వివాహాలు చేసుకుంటే రూ.1.20 లక్షల సాయం అందుతుందన్నారు. బీసీలకు రూ.50 వేలు, బీసీ కులాంతర వివాహాలకు రూ. రూ.75 వేలు, మైనార్టీలకు రూ.1 లక్ష, దివ్యాంగులకు రూ.1.50 లక్షల సాయం ప్రభుత్వం అందిస్తుందని వివరించారు.

23న ఆన్‌లైన్ చేతిరాత పోటీలు

విజయనగరం అర్బన్: చేతిరాత దినోత్సవం సందర్భంగా ఈ నెల 23న జాతీయస్థాయిలో చేతిరాత పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శి షేక్ మహబూబ్ హుస్సేన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మఒడి హ్యాండ్‌రైటింగ్ అండ్ కాలిగ్రఫీ ఇన్‌స్టిట్యూట్, ఆల్ ఇండియా గ్రాఫాలజీ అసోసియేషన్, హ్యాండ్‌రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా పోటీలు నిర్వహిస్తాయన్నారు. 1వ తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ వరకు చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం సెల్: 86394 14376, 91822 00765 నంబర్లను సంప్రదించాలని సూచించారు. విజేతలకు కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా మెడల్స్, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో సేవ

- ఆదర్శంగా నిలుస్తున్న యువజన సంఘాలు
- పలు గ్రామాల్లో విద్యార్థులు, గ్రామస్తులకు అండదండలు
- గ్రామాభివృద్ధే ధ్యేయంగా కార్యక్రమాలు



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందిస్తున్న పక్కి స్వామి వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు

బొబ్బిలి రూరల్: దేశభవిష్యత్తు యువతచేతిలో ఉందన్న స్వామి వివేకానంద మాటలను పలు యువజన సంఘాలు ఆదర్శంగా తీసుకుని పాటిస్తున్నాయి. సేవాకార్యక్రమాల నిర్వహణలో ముందుంటూ ప్రజలకు పలు కార్యక్రమాలలో అవగాహన కల్పిస్తున్నాయి. నేడు వివేకానందుని జయంతి సందర్భంగా యువజన సంఘాల కార్యకలాపాలపై కథనం. బొబ్బిలి మండలంలోని 30పంచాయతీలలో 25యువజన సంఘాలు ఉన్నాయి. వాటిలో కోమటిపల్లి, పక్కి, కృష్ణాపురం, పారాది, అలజంగి, గొంగాడవలస, ఎం.బూర్జవలస, కింతలివానిపేట తదితర గ్రామాలలో యువజన సంఘాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. పక్కిలో స్వామివివేకానంద యూత్ సొసైటీ శంబంగి శంకరరావు ఆధ్వర్యంలో 2012నుంచి సేవలు అందిస్తూ యువతకు దిశానిర్దేశం చేస్తోంది. రక్తదానశిబిరాలు ఏర్పాటుచేసి, పేద విద్యార్థులకు ఉచితంగా స్టడీమెటీరియల్, స్పోర్ట్స్ కిట్‌లు అందిస్తూ, గ్రంథాలయం, రచ్చబండ, చలివేంద్రాలు ఏర్పాటుచేయడమే కాకుండా నేత్రదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు.

కృష్ణాపురంలో..

కృష్ణాపురంలో శ్రీచైతన్యయువజన సంఘాన్ని 1998లో చుక్కశ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 40మంది యువత సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో కేవలం కృష్ణాపురంలోనే కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. మద్యం, ఎయిడ్స్, మూఢనమ్మకాలపై ప్రచారం చేస్తూ ముందుకు సాగుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్ద ఎత్తున కృషిచేస్తున్నారు.

కోమటిపల్లిలో..

కోమటిపల్లిలో స్వచ్ఛత యువజనసేవాసంఘాన్ని బొంతలకోటి శంకరరావు 1997లో ప్రారంభించారు. నెహ్రూయువకేంద్రం సహాయంతో యువజనులకు క్రీడాపోటీలు నిర్వహిస్తూ, మహిళలు, ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామంలో స్వామివివేకానంద గ్రంథాలయాన్ని బొంతలకోటి శంకరరావు తన సొంత ఖర్చుతో ఏర్పాటుచేశారు. పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్నారు. మహిళలను చైతన్యపరుస్తూ సమాజాన్ని మేల్కొలిపే చర్యలు చేపడుతున్నారు.

గొంగాడ వలసలో..

గొంగాడవలస గ్రామంలో గొంగాడవలస సేవా సమితి పేరిట జి.శంకరరావు నేతృత్వంలో యువజన సంఘం ద్వారా గ్రామంలో వైద్యశిబిరాల ఏర్పాటు, విద్యాసామగ్రి పంపిణీ తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే గ్రామంలో అబ్దుల్ కలాం పేరిట గ్రంథాలయం ఏర్పాటుచేశారు. ఎం.బూర్జవలసలో అబ్దుల్‌కలాం యువజనసేవాసంఘం పలు సేవాకార్యక్రమాలు చేపడుతోంది.



రక్తదాన శిబిరం నిర్వహించిన యూత్‌సభ్యులు.. పాల్గొన్న ఎమ్మెల్యే



మొక్కలు నాటుతున్న కృష్ణాపురం చైతన్యసేవాసంస్థ సభ్యులు

యువత, విద్యార్థులకు పలు విధాలుగా ఆసరా కల్పిస్తోంది. ఇవికాక అలజంగి, చింతాడ, పక్కి, పిరిడిలో అంబేడ్కర్ యువజనసంఘాలు పోటీపరీక్షలపై విద్యార్థులలో అవగాహన, ఆసక్తి కలిగిస్తూ వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. స్టడీమెటీరియల్ అందుబాటులో ఉంచుతూ విద్యార్థులను పోటీపరీక్షలకు సిద్ధం చేస్తున్నాయి.

గ్రామాభివృద్ధి యువతతోనే సాధ్యం



యువత చదువు, ముందుచూపుతోనే గ్రామాభివృద్ధి సాధ్యమనే లక్ష్యంతో గ్రామపెద్దల సహకారంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. యువతను చైతన్యబాటలో నడిపిస్తూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

శంబంగి శంకరరావు,
యూత్‌సొసైటీ అధ్యక్షుడు, పక్కి

అందరి సహకారంతో..



గ్రామంలో అందరి సహకారంతో మంచి కార్యక్రమాలు చేపడుతున్నాం. అందరం కలిసి గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో యువజన సంఘం ఏర్పాటుచేసి పనిచేస్తున్నాం. అందరం బాగుండాలన్నదే మా లక్ష్యం.

చుక్క శ్రీనివాసరావు,
అధ్యక్షుడు, చైతన్యయువజన సంఘం, కృష్ణాపురం

యువత చైతన్యవంతులు కావాలి



గ్రామాలలో యువత చైతన్యవంతులై గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి. యువత గ్రామాల్లో కొన్ని పనులు చేపడితే అవగాహన వస్తుంది.

బొంతలకోటి శంకరరావు, కార్యదర్శి,
స్వచ్ఛతా సేవా సొసైటీ, కోమటిపల్లి

యువత ఆదర్శంగా ఉండాలి



గ్రామంలో యువత ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో 2005లో గొంగాడవలస సేవాసమితి ప్రారంభించి, పలు సేవాకార్యక్రమాలు చేపడుతున్నాం. గ్రామంలో అబ్దుల్ కలాం పేరిట గ్రంథాలయం ఏర్పాటుచేశాం.

గొంగాడవలస శంకరరావు, గొంగాడవలస
సేవాసమితి కార్యదర్శి,గొంగాడవలస

సంక్రాంతి పప్పుల చీటీ నిందితుల అరెస్టు

- 24వేల మందికి పైగా బాధితులు
- రూ.కోటీ 28 లక్షల73 విలువైన ఆస్తులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఎం.దీపిక



వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఏఆర్ బెనిఫిట్ ఫుడ్ సంక్రాంతి కానుక (పప్పుల చీటీ) పేరుతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 24వేల మంది నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించినట్టు గుర్ల పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.కోటీ 28 లక్షల 73వేల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. విజయనగరం జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

కొండకరకం గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు మజ్జి అప్పలరాజు, కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ శ్రీలేఖ, కొండకరకం గ్రామానికి చెందిన మజ్జి రమేష్ ఒక బృందంగా ఏర్పడి, సంక్రాంతి పండగకు 24 రకాల గ్రోసరీ సామాన్లు ఇచ్చేందుకుగానూ నెలకు రూ.300ల చొప్పున ఒక్కొక్కరి నుంచి రూ.3,600ల చొప్పున వసూలు చేశారు. దీనికోసం వివిధ గ్రామాల్లో 189 మంది ఏజెంట్లను నియమించి వసూళ్లకు పాల్పడ్డారు. ఈ తరహా చీటీని 2021లో నిందితుడు ప్రారంభించి విజయవంతంగా నిర్వహించడంతో ఎక్కువ మంది ఈ ఏడాది చీటీ కట్టేందుకు ఆసక్తి కనబర్చారు. విచారణలో సుమారు 24వేల మంది నుంచి రూ. 8 కోట్ల 9లక్షల74వేల 300 మొత్తాన్ని నిందితులు చీటీ పేరుతో వసూలు చేసినట్టు తేలింది. ప్రధాన నిందితుడు విజయవాడలో వాటర్ ప్లాంట్ కొత్తగా పెట్టేందుకు రూ. 3.5 కోట్లను పెట్టుబడిగా పెట్టాడు. సకాలంలో ప్లాంట్ ప్రారంభం కాకపోవడంతో చీటీ కట్టిన వారికి గ్రోసరీ సామాన్లు అందించలేకపోయాడు. దీంతో బాధితులు ఫిర్యాదుచేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అరెస్టు చేసిన నిందితుల నుంచి రూ.15.18 లక్షల విలువైన 297.710 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.44,12,900 నగదు, రూ. 29,95,000 విలువైన భూమి డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఐదు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.39,06,326 నగదును ఫ్రీజ్ చేశాం. ఇవి కాకుండా వీరి పేరున 16 వాహనాలు, రెండు వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు గుర్తించాం. స్వాధీనం చేసుకున్న భూముల మార్కెట్ విలువ ఎక్కువగానే ఉంటుందని, వీటిని కోర్టులో దాఖలు చేసి, విచారణ అనంతరం కోర్టు అనుమతితో బాధితులకు అందజేస్తామని ఎస్పీ వెల్లడించారు.

కేసు దర్యాప్తునకు ప్రత్యేకాధికాల నియామకం

పప్పుల చీటీ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి కేసు విచారణను మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ అర్జునరావును ప్రత్యేకంగా నియమించారని, వారు త్వరలో కేసు దర్యాప్తు ప్రారంభిస్తారని ఎస్పీ తెలిపారు. అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని జిల్లా ప్రజలకు కోరారు. కేసు దర్యాప్తు ప్రారంభించి, నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఆస్తులను రికవరీ చేయడంలో ప్రధాన భూమిక పోషించిన చీపురుపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహనరావు, గుర్ల ఎస్‌ఐ శిరీషలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

13న శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి



పట్టణంలోని శిల్పారామం ప్రాంగణం

విజయనగరం అర్బన్: స్థానిక శిల్పారామం వేదికగా ఈ నెల 13న సంక్రాంతి సంబరాలను అంగరంగ వైభవంగా, తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. సంక్రాంతి సంబరాల ఏర్పాట్లు, వివిధ పోటీల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో బుధవారం జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శిల్పారామాన్ని సుందరంగా ముస్తాబు చేయాలని సూచించారు. సంగీత కచేరీలు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. భోగిమంటలు, హరిదాసుల సందడి, ఎడ్లబండ్ల ప్రదర్శనలు ఉండేలా చూడాలన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు శిల్పారామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. సంబరాల రోజు 13వ తేదీ ఉదయం నుంచి వస్త్రధారణ, వంటల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. వరుస ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, మహిళా సమాఖ్య, డీఆర్‌డీఏ విభాగాలు పోటీల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు సిరిపురం విద్యార్థులు



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

సంతకవిటి: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కె.సన్నిబాబు బుధవారం తెలిపారు. ఈనెల 20 నుంచి 24 వరకూ శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ స్కూల్‌గేమ్స్ పోటీలకు ఈ విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. నవంబర్ 10న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ ఆధారంగా పాఠశాలకు చెందిన ఆర్.స్వాతి, బి.సోనియా, కె.హారిక, సీహెచ్.యశ్వంత్, జి.రాజేష్, పి.శ్రీలత, పి.రాజ్‌కుమార్, వి.రాజశేఖర్, బి.వెంకటలక్ష్మి తదితరులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వజ్జా వెంకటరావు వెల్లడించారు. ఈ మేరకు ఆ విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పంచాయతీ సర్పంచ్ డోల తిరుపతి, గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి బుడ్డేపు సన్యాశిరావు, అక్కలబోతు శ్రీరాములు తదితరులు అభినందించి, రూ. 2 వేల ఆర్థిక సాయం అందించారు.

కలశ నివేదన



స్వామికి కలశాలతో పాయసాన్ని నివేదిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: ధనుర్మాసంలో భాగంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని రామస్వామివారికి అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రాతఃకాల సమయంలో ప్రత్యేకంగా తీపి పాయసం తయారు చేసి 108 కలశాలతో శ్రీకృష్ణ భగవానుడికి నివేదించారు. అనంతరం తీపి పాయసాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, మల్లిఖార్జున శర్మ, కిరణ్‌కుమారాచార్యులు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు

- రూ.16.6 కోట్లతో 166 ఆలయాల నిర్మాణం
- దేవాదాయశాఖ ఈఈ వెంకటరమణ



రెడ్డిపేటలో ఆలయ పనులు పరిశీలించి మాట్లాడుతున్న ఈఈ వెంకటరమణ

చీపురుపల్లి: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే ఆలయాల నిర్మాణానికి విరివిగా నిధులు మంజూరు చేస్తోందని దేవాదాయశాఖ ఈఈ సీహెచ్.వెంకటరమణ చెప్పారు. దేవాదాయశాఖ, టీటీడీ నిధులతో నిర్మాణంలో ఉన్న ఆలయాలను పరిశీలించేందుకు బుధవారం ఆయన చీపురుపల్లి వచ్చారు.ఈ మేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మండలంలోని పలు ఆలయాల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లో 166 ఆలయాల నిర్మాణానికి రూ.16.6 కోట్లు నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కుటుంబాలు నివాసం ఉండే ప్రాంతాల్లో హిందూ దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నుంచి నిధులు సమకూర్చుతున్నట్లు చెప్పారు. ఒక్కో ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు కాగా అందులో రూ.8 లక్షలు ఆలయ నిర్మాణానికి, రూ.2 లక్షలు విగ్రహాల కోసం వెచ్చించాల్సి ఉందన్నారు. ఇప్పటికే దాతలు, గ్రామస్తుల సహకారంతో నిర్మాణాలు ప్రారంభమైన ఆలయాలకు సైతం నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

కాంట్రాక్ట్ పద్ధతిన ఇంజినీర్ల నియామకం

11 నెలల్లో దేవాలయాల నిర్మాణం పూర్తి చేసే దిశగా ప్రతి 40 ఆలయాలకు నిర్మాణ పర్యవేక్షణ కోసం కాంట్రాక్ట్ పద్ధతిన ఇంజినీర్లను నియమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల, కరణం ఆది, రాందాసు, ముల్లు పైడిరాజు, మంగళగిరి శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గొట్లాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల(కత్తి యుద్ధం)కు గొట్లాంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు పీడీ యు.సత్యానంద్ బుధవారం తెలిపారు.అండర్ 19 విభాగంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించగా తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఎల్.విజదుర్గ, పావని,బి.భాగ్యశ్రీ, కె.సుమంత్‌లు ఈనెల 18 నుంచి 20 వ తేదీ వరకు కర్నూలు జిల్లాలోని నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చోరీ సొత్తు స్వాధీనం

- ఇద్దరు నిందితుల అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఎం.దీపిక (వెనుక ముసుగులో నిందితులు) రికవరీ చేసుకున్న బంగారు ఆభరణాలు

విజయనగరం క్రైమ్: చోరీకేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, చోరీ చేసిన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ ఎం.దీపిక బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. స్థానిక కంటోన్మెంట్ బజారు వీధిలో నివసిస్తున్న మహమ్మద్ అజుజుర్ రెహమాన్ ఇంట్లోకి గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఈ నెల 8వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత టెర్రస్‌పై నుంచి దిగి ఇంట్లో ఉన్న 30 తులాల బంగారు ఆభరణాలను దొంగిలించారు. నిందితులు పరారయ్యే సమయంలో మేల్కొన్న ఇంటి యజమాని వెంటనే అప్రమత్తమై డయల్ 100కు సమాచారమందించారు. పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది ఆ సమాచారాన్ని రాత్రి గస్తీ తిరుగుతున్న పోలీసు అధికారులకు అందించగా, నేరం జరిగిన స్థలానికి క్లూస్ టీమ్, సీసీఎస్ పోలీసులు చేరుకుని, పరిశీలించి ఆధారాలను సేకరించారు. నేరస్థలంలో లభించిన ఆధారాలను ఉపయోగించి, నేరానికి పాల్పడిన వ్యక్తులను పాత నేరస్తులుగా గుర్తించారు. ఈ మేరకు గతంలో 13 నేరాలకు పాల్పడిన కణపాక చెన్నారెడ్డి కాలనీకి చెందిన గుర్రపు శివ, పొట్నూరు సంతోష్‌కుమార్ అలియాస్ సంతోష్‌లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 30 తులాల బంగారు ఆభరణాలను (పది గాజులు, మూడు చైన్లు, రెండు లాకెట్లు, నెక్లెస్, మూడు రింగులు, తొమ్మిది చెవిదిద్దులు) స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఎస్పీ సీఐలు జి.రాంబాబు, రుద్రశేఖర్, ఎస్సై అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో పెదమరికి క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సాగర్, రూరల్ ఎస్సై సింహాచలం తదితరులు

పార్వతీపురం: ఆరవ రిపబ్లిక్ కప్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీలలో పార్వతీపురం మండలంలోని పెదమరికి గ్రామ పంచాయతీ క్రీడాకారులు రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు కరాటే కోచ్ పి.సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని సికొకాయ్ కరాటే ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పెదమరికి గ్రామ క్రీడాకారులు ముద్దాడ కార్తికేయ, మసియా యువతేజలు పాల్గొని వెండి పతకాన్ని, బొండపల్లి తరుణ్ రాజ్, కొండగొర్రి ఆకాష్‌లు కాంస్య పతకాన్ని గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్న రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై.సింహాచలం మాట్లాడుతూ కరాటేలో గ్రామానికి పతకాలు రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రీడా రంగంలో పార్వతీపురం మన్యం జిల్లా క్రీడాకారులు ఎప్పుడూ ముందంజలో ఉంటారని ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ హెచ్.గంగమ్మ, మాజీ సర్పంచ్ ఆర్.సోమశేఖర్, టి.పకీరునాయుడు, అసిస్టెంట్ కోచ్ ఎం.వీరన్ గ్రామ పెద్దలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీ: ముగ్గురికి గాయాలు

రామభద్రపురం: మండలంలోని తారాపురం గ్రామ సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. కొట్టక్కి గ్రామం నుంచి తారాపురం మీదుగా రామభద్రపురం ట్రాక్టర్ వస్తుండగా అదే సమయంలో వెనుకగా వస్తున్న సాలూరు నుంచి ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి వెనుకభాగంలో ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ సామిరెడ్డి శంకరరావుతో పాటు ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న కొట్టక్కి గ్రామానికి చెందిన సామిరెడ్డి పోలినాయుడు, సామిరెడ్డి కామినాయుడులు తుళ్లిపోయి రోడ్డు మీద పడి గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై సురేంద్రనాయుడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రులను బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాద వివరాలు తెలుసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.